# ఋణస్థుడి వేట!

రచన :
... "క్రిష్ణప్రసాద్" ...

★

అన్నివేటల్లోకీ కష్టమైనది, సున్నితమైనది అయిన అప్పుల వాళ్ళ వేటకి పూనుకుంది హేమాకి. ఆమె కాస్త దిట్టమైన మనిషనే ప్రతీతి. అసలు అప్పిచ్చినవాణ్ని పసికట్టడమే కష్టం. వేటగాడి విల్లుచూసి పరిగెత్తేలేడి ఎక్కడో ఏ దుబ్బుల్లోనో, చెట్లలోనో చిక్కుకుని పట్టుబడ్డేతప్ప దొరకనట్టు. హేమాకిది వదిలిపెట్టిన ఆ ఒక్క అక్షరంగూడా కలుపుకుంటే నిజంగా బంగారపు నాలుకే. మెత్తనిది పదునైనది ఎక్కడ ఎట్లాతిరగాలో బాగా ఎరిగున్నదీ; తీపి, వగరు, చేదు అన్నిరుచులు చవిచూపించగలదీనూ!

అసలు ఈ అప్పుకి కాలదోషంపట్టి చాలారోజులైంది. ఆమైతే వదిలిపెట్టలేదు. వాళ్ళావూరినించి వెళ్ళిపోయారు. తరవాత ఆమె ఐదుగురు పిల్లల్ని కన్నది. అందులో ముగ్గురు అప్పుడే పోయారు. పోతే ఇప్పుడు వున్నవాళ్ళు ఇద్దరు. ముందర ఇది తెలుసుకోవాలి మీరు; అప్పిచ్చిన ఆమెభర్త అన్నిప్రయత్నాలూచేసి ఆశలు వదిలేసిన తరవాత, ఇప్పుడు ఆమె బైలుదేరింది. ఆయన సణుగుతూనే వున్నాడు. ఆమె వూరికి ప్రయాణమవుతుంటే ఆ వూరిలో ఆమెదిగిన పక్కింటాయన "అబ్బే! ఇంకేం లాభంలేదండీ..." అని అనవసరంగా తిట్లుతిన్నాడు పాపం! మనసులోనే తిట్టుకున్నదనుకోండి. ఏమైతేనేం ఆమె మంచిగుండె నిబ్బరమున్న మనిషనే చెప్పాలి.

తోడుతెచ్చుకున్న ఒక పూర్వ సువాసినిని వెంటతీసుకుని, ఆయన ఇంటికి బైలుదేరింది. చుట్టూ పదిళ్ళల్లో ఏ మూలనుంచన్నా, ఏవెధవన్నా గభక్కని తుమ్ముతాడేమో చూసుకుని అక్కడొక చౌకులో కాసేపాగి, ఎటు పోవాలో గట్టిగా తెల్చుకుని అటువైపు తిరిగారు. చేతిలోపాపని అవిడ చేతికిచ్చి, వేలుపట్టుకునివస్తున్న పిల్లని నడిపించుకుంటూ, ముక్కుకు సూటిగా క్రోసెడుదూరం పొడుగున్న రోడ్డు పట్టుకుంది.

"మొదట ఏం మాట్లాడాలి?" ఆమె మనస్సు అడ్డుప్రశ్న వేసింది. వెంటనే ఆలోచించమని మెదడు నాజ్ఞాపించింది. ఏముందీ? వున్నసంగతి చెప్తాను. మాడబ్బు మాకిమ్మని అడుగుతాను అంతే!" అనుకుంది మనసులో. మెదడు బాగా ఆలోచించినట్టు నటించి "ఆ! అవును అంతే!" అన్నది. ఆ పూర్వసువాసినికిగూడా ఇదే ఆలోచన తట్టినట్టుంది. ఇద్దరూకలిసి కాసేపు మెదళ్ళకి పని కల్పించుకుని దారి శుభ్రంచేసేసుకున్నారు; అడుగులు కొంచెం వేగం హెచ్చించాయి. ఆ ముసుగావిడ ఎవర్నో నిలేసింది ఆ రోడ్డు అదేనేమో మళ్ళీ కనుక్కోడానికి. ఆయనేదో అన్నాడు వాళ్ళకి వినపడకుండా. "ఇంకాస్తదూరం పోయింతర్వాత అడక్కూడదూ? అన్నీ తొందరేనీకు!" హేమాక్షి కంఠం హెచ్చరించిందావిడ్ని. అసలు ఆమే మొదట అడగాలనుకుంది. ఏడుస్తున్నపాపని అవిడచేతులోంచి తీసుకుని బుజంమీద పడుకోబెట్టుకుంది. అవిడకి చేతులు నెప్పులుపుట్టి దానిముడ్డి గిల్లిందో ఏమో, ఎవరికి తెలుసు. లేకపోతే నవ్వుతూ నవ్వుతూ అంతలోనే ఒక్కసారి గుక్కపెట్టి ఏడవడమేమిటి?

తరువాత ఏభైగజాలన్నా జరక్కమునుపే, హేమాక్షి అవిడకీ మళ్ళీ ఎవర్నన్నా అడగమని ఆదేశమిచ్చింది. ఇంతసేపూ ఎట్లాగో నిశ్శబ్దంగా నోరుమెదపకుండా నడిచివచ్చిందావిడ. "ఇటు కుడివైపుగావెళ్ళి ఎడమవైపుకి తిరగాలి..." అంతటితో పోనిచ్చాడాయనెవరో అదృష్టం! మన షేక్స్పియర్ విదూషకుడిలాంటివాడెవ్వడూ తటస్థపడలా. ఇంకో అరగంట వీధులంబడి విహరించింతర్వాత, ఓ నడివయసావిడ ఒక ఎత్తుగోడల ఇల్లు చూపించి పుణ్యంకట్టుకుంది.

వినయం ఉట్టిపడేటట్టు నడుస్తూ, నెమ్మదిగా లోపలికెళ్ళారు. ఆ ఇంట్లోవాళ్ళు వీళ్లనిచూసి తెల్లమొహాలు పెట్టారు. కాస్త వయసుముదిరిన ఆమె, చాపపరిచి, కూచోండి అన్నది మర్యాదగా. అంతా కూచున్నారు! ఏశబ్దమూచేయకుండా మూడునిముషాలు వీచింది గాలి. హేమాక్షి గొంతు సవరించుకుని మాటలకి మెరుగుపెడ్తూ పలికింది. "మన్నారావుగారిల్లే కదండీ?" అటువైపు వాళ్ళు-ఆమె, ఒక ఎదిగిన అమ్మాయి బహుశా ఆమె కూతురై వుండచ్చు. ఇద్దరూ ఉత్సాహంతో, ఉత్సుకతతో అదుర్దాగా ఎదురుచూస్తున్నారు ఆమె ఏం చెపుతుందా అని.

హేమాక్షి మళ్ళీ ఇటూ అటూ చూసింది. "వారు ఇంట్లో లేరా?" కొత్తయిల్లంతా ఒకసారి పరకాయించింది. ఆయన ఇల్లుకట్టుకున్నాడని అదివరకే విన్నదావిడ. "ఇంత పెద్ద ఇల్లుకట్టాడే; మాడబ్బు మాకు పారేయలేడూ?" అనుకున్నది లోపల. "లేరండీ!" అంతకంటె వాళ్ళెక్కువ మాట్లాడలేదు. ఈవిడ మన ఓపిక ఎంతఉందో చూస్తోందా, అనిపించింది వాళ్లకి. ఆ అమ్మాయి ఫిడేలుకమాను అప్పుడే పక్కన పెట్టేసింది. "ఇంకా ఆఫీసునుంచి రాలేదనుకుంటా..." మళ్ళీ ఇంకోప్రశ్న ఆ గదంతా నింపింది. వాళ్ల చెవుల్లో అదే గింగురుమంటోంది. "అవునండీ?" వాళ్ళ ఓర్పు ఉన్నతస్థాయి కొచ్చేసినట్టే?

ఇక ఉపోద్ఘాతం వదిలిపెట్టి అసలు విషయం ఎత్తుకొన్నది హేమాక్షి. "అ్హ! ఏమీలేదండీ ... మీవారు మాకు కొంత పైకమివ్వాలి. ఎన్నోఏళ్ళక్రితం అప్పుగా తీసుకున్నారు." ఆవిడ, ఆవిడకూతురు, శీతాకాలం పొద్దున్నే కొండశిఖరంమీది మంచులాగా తెల్లబడ్డారు. పాల భాగం మీద నరం నలుపెక్కింది. "అరె! నాకు తెలియనే తెలియదే. అప్పున్నట్టు వారు నాకు ఎప్పుడూ చెప్పనేలేదే?" ఆమె గొంతు బొంగురుపోయింది. ఆమె కంఠం వణుకుతోంది. 'అదీ ఒక ఆడమనిషికా' ఆమె గుండెల్లో నగారా మోత వినిపిస్తూంది.

హేమాక్షి స్థిరంగా కూచుని మళ్ళీ మొదలెట్టింది. మావారప్పుడు ఇక్కడ పనిచేస్తుండేవారు, అదీ ఎంతో ఒత్తిడిపెట్టి తీసికెళ్లారు మేమివ్వమంటే, మళ్ళీ రేపే తీసుకొచ్చి ఇచ్చేస్తానని. ఆ మూడోనాడు నోటుతీసుకు తయారయినారు. మావారు ఇంకెవరిదగ్గర్నుంచో రావాల్నుంటే వీరికి నోటిచ్చి వసూలుచేసుకు రమ్మన్నారట. అంటే ఈ పని చేశారు. రెండుమూడుసార్లు నోట్లు తిరగరాయించారట. తరవాత అదిగూడా లేదు. "ఇంకావుంది అన్నట్టు అక్కడ వదిలిపెట్టి మళ్ళీ పొడిగించింది." అయితే మాకు చెఱుపు చెయ్యాలనుకున్న వాళ్ళెవ్వరూ బాగుపడలేదులెండి. అయన (ఒక పేరుచెప్పి) అయన ఏమైనాడు? అయన కొడుకులు పోయారు. అయన చచ్చాడు. పెళ్ళాం వీధుల్లో అడుక్కుతింటోందిప్పుడు." గుక్క తిప్పుకోడానికి అగిందక్కడ.

ఆ ముసుగావిడ, ఆమెకు సహాయురాలు. కాస్త సహాయంచేద్దామని అందుకుంది. "క్రిందటిఏడు అడిగితే ఈ సంవత్సరం పంటలడబ్బులోది ఇచ్చేస్తాం అని రాసారట." ఆ ఇంటావిడ వెనకగోడకి జేర్లబడ్డది. ఆ అమ్మాయి కూచున్నచోటే క్రిందకి కుంగిపోతోంది. ఒక్కసారి కళ్ళు మెరిపించింది. "అరె! మా కొక్క సెంటుభూమిగూడా లేదే? అసలు వారింటిపేరేమిటండీ?..." హేమాక్షి కాస్త తమాయించుకుని "మండనం వారు" అంది ఎండిపోయిన గొంతుతో. "అదా?!" ఆ అమ్మాయి నడుం సాఫుచేసుకుని విజయగర్వంతో, అరిచినంత గట్టిగా అన్నది. "మా ఇంటిపేరు న్యాపతి! వాళ్ళిల్లు ఆ అవతల సందులో ఉంది." ఆ ఇంటావిడ గుండె మళ్ళీ కొట్టుకోవడం ప్రారంభించింది. నిటారుగా కూచుంది.

హేమాక్షి, ఆమెకి తోడొచ్చిన ఆవిడా పూర్తిగా ఆపాదమస్తకమూ (నిండా 4'-5"—4'-6") పాలిపోయినారు. ఇద్దరూ ఒక్కసారే అప్రయత్నంగా "ఓ! అట్లాగా?!" అని ఓ చిన్న పొట్టిశబ్దంచేసి లేచి నుంచున్నారు. ఆ ఇంటావిడ ఇప్పుడు పూర్తిగా మనిషిఅయింది. "అయ్యో! అప్పుడే వెళ్లిపోతారా? కూచోండి?! అసలెంతివ్వాలేమిటి? అయనకి అప్పులున్నాయా, పైకి చాలా ఇదిగా కనబడ్తాడే?" అంతులేని ప్రశ్నాప్రవాహంతో చుట్టుముట్టింది వాళ్లని. ఎట్లాగైతేనేం ఆ ప్రవాహాన్ని చీల్చుకుని రోడ్డుమీదపడ్డారు వాళ్ళు. "ఈ ముదరష్టపు పేరుతో ప్రపంచంలో ఎక్కడా ఇంకోమనిషుంటాడనే అనుకోలేదే?!" ఆ పూర్వ సువాసిని అంటోంది.

ఇంకా తమాషా ఏమిటంటే, హేమాక్షి ఆ ఇంటిని, ఆ మనిషిని పట్టుకోవడమే కాకుండా, అప్పటికప్పుడు రొఖ్ఖం ఏభై రూపాయలు చేతిలో వేయించుకుని, ప్రతి మూడునెల్లకీ ఏభై వంతున పంపిస్తానని వాగ్దానం గూడా పుచ్చుకుంది. అయితే అయన ఆ వాగ్దానం నిలబెట్టుకున్నాడా లేదా అనేది తరవాత సంగతి!

(రచయితదే ఒక ఆంగ్ల కథకి అనువాదం)


# జీవానందరసాయనము

ఊరపిచ్చుకల సత్తుతో ఫలరసములతో మలయాళ పద్ధతిలో తయారుచేయబడినది. స్త్రీ పురుషులకు గలుగు అన్ని వ్యాధులకు ఇది దివ్యౌషధము. రుచికరమైనది. పథ్యములేదు. సర్వకాలములందు యెల్లరు భుజింపదగినది.

జీవానందరసాయనమును పుచ్చుకొనిన జీవనరములలోచేరి వచ్చిన మేహ దుర్నీరు నశించును. స్త్రీ సంభోగముచే నేర్పడిన తెలుపు కాక, గ్రంధి, మేహవ్యాధి, మేహదురద, పిత్తపాండు, క్షయ, కాసలను పోగొట్టును దీనితోసాటి వేరొకటి లేదు. దురభ్యాసమువలన (హస్తప్రయోగాదులచే) గుహ్యావయము దుర్భలమై చిక్కిపోవును. వేడి, బలహీనము, ధాతునష్టము, స్వప్నస్ఖలితము, నరముల బలహీనత, ఆయాసము, దేహభీతి, ఆకలిలేకుండుట, మలబద్ధకం, గుల్మము, అజీర్ణం, నిద్రలేకుండుట, మేహకాక, రక్తముచెడుటచే గల్గు వ్యాధులు, మూలకాక, గుండెదడ, వెన్నునొప్పి, దగ్గు, ఇంద్రియము నీరై మూత్రములో పోవుట, స్త్రీలకడకుచేరినను తలచినను వెంటనే స్ఖలితమైపోవుట సంభోగచింత గలగనే తనకు తెలియకనే ఇంద్రియముపోవుట, కాలు చేతుల బలహీనత, జ్ఞాపకశూన్యము, దృష్టిమాంద్యము, మొదలైన లెక్కలేని వ్యాధులను పోగొట్టి, వీర్యవృద్ధి, ధాతుపుష్టి, రక్తవృద్ధి, భోగశక్తిని అపారముగ గల్గించును. శక్తివిహీనమై దుర్భలమైన గుహ్యావయవమునకు బలమునిచ్చి వృద్ధిచేసి రక్తకందరములను పెంపొందించును. సాటిలేని సంభోగానందమును గల్గించును. స్త్రీలకు గలుగు బుతుదోషము, రక్తము అధికముగ స్రవించుట, సంతానాధిక్యమువలన దేహము కృశించుట, మర్మావయవము కృశించుట, బలహీనము, మర్మస్థానమున దురద, మంట, నొప్పి, వేడిచే తెలుపుకారుట, చర్మ సంబంధమైన మేహవ్యాధులు మొదలైన అనేక వ్యాధులను ఖండించి దేహమునకు, పుష్టి, బలము, కాంతిని కల్గించును. ½ పౌను టిన్ను 1-కి 2-12-0 తపాలాచార్జి 0-12-0

ధనలక్ష్మి అండు కో., సాకారుపేట పోస్టు, మదరాసు.